సాక్షి పశ్చిమగోదావరి

శనివారం : 26 : జూలై : 2025



మూడు గంటల్లోనే కేసు ఛేదన

అదృశ్యమైన బాలుడిని పెంటపాడు పోలీసులు మూడు గంటల్లో సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు.


8లో ▸



7 నుంచి పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఆగస్టు 7 నుంచి 10 వరకు స్వామివారి దివ్య పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు.

8లో ▸



జలపాతాల సోయగం

నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని జలపాతాలు కనువిందు చేస్తున్నాయి.

8లో ▸

రెడ్‌బుక్ టార్గెట్

కక్ష గట్టి.. కేసులు పెట్టి..

- తప్పుడు కేసులు.. అడ్డగోలు అరెస్టులు
- ఏళ్ల క్రితం సంఘటనలపై తాజాగా కేసులు, అరెస్టులు
- 2022లో పాలకొల్లులో జరిగిన సంఘటనపై సీఐడీ కేసు
- 2024లో జరిగిన ఘటనలో తాజాగా అరెస్టులు
- దెందులూరులో చింతమనేని అరాచకపర్వం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా వేధింపులు
- ఏలూరు జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోదరుల అరెస్టు
- పశ్చిమలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు



పెదవేగి మండలం రామశింగవరంలో అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులను ప్రశ్నిస్తున్న కామిరెడ్డి నాని



ఏలూరులో చల్లగొళ్ల తేజను అరెస్టు చేస్తున్న పోలీసులు



ఏలూరు రూరల్ స్టేషన్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షిప్రతినిధి, ఏలూరు: కేసులో ఫిర్యాదులుండవు.. ఘటన జరిగిన దాఖలాలు కూడా అతి తక్కువ.. ఒకవేళ ఏదైనా సాధారణ సంఘటన జరిగితే దానిని తవ్వితీసి నాన్ బెయిల్‌బుల్ సెక్షన్లు వర్తించేలా కేసులు కట్టడం.. ఎమ్మెల్యేల కళ్లల్లో ఆనందం చూడటం.. ఇది ఉమ్మడి పశ్చిమలో పోలీసుల తీరు. సంబంధం లేని వ్యవహారాల్లో ఎలాంటి ప్రమేయం లేని వైఎస్సార్‌సీపీ కీలక నేతలను టార్గెట్ చేసి మరీ కేసులు నమోదు చేస్తున్నారు. అది కూడా జనవరిలో కేసు నమోదు చేస్తే మేలో అరెస్టు చేయడం జూలైలో కోర్టులో చార్జిషీటు దాఖలు చేస్తూ అడ్డగోలు రెడ్‌బుక్ రాజ్యాంగానికి పోలీసులు అడుగడుగునా సహకరిస్తున్నారు. తాజాగా 2022లో పాలకొల్లులో జరిగిన టిడ్కో ఇళ్ల ప్రారంభ సభలో చిన్నపాటి వివాదానికి సంబంధించి గతేడాది కేసు నమోదు చేసి తాజాగా సీఐడీకి అప్పగించాలని నిర్ణయించారు. అలాగే గతేడాది దెందులూరులో జరిగిన చిన్న **వివాదానికి సంబంధించి** నాలుగు నెలలు తర్వాత **ఎఫ్ఐఆర్ కట్టి సరిగ్గా ఏడాది** తర్వాత అరెస్టు చేయడం **జిల్లాలో తీవ్ర చర్చనీయాం**శంగా మారాయి.

పాత ఫిర్యాదులను తవ్వితీసి..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగం **పక్కాగా అమలవుతోంది.** ఏదైనా సంఘటన జరిగితే **దానిపై కేసులు నమోదు** చేయకుండా పాత కేసు**లను, పాత ఫిర్యాదులను** వెతికి మరీ తవ్వితీసి **వాటిపై కేసులు నమోదు** చేస్తూ జిల్లాలో తప్పుడు **సంస్కృతికి తెలుగుదేశం** నాయకులు తెరదీశారు. **ఈ క్రమంలో పాలకొల్లు,** దెందులూరు నియోజకవర్గాల్లో రెండు అక్రమ కేసుల్లో వైఎస్సార్‌సీపీ నేతలపై వేధింపుల పర్వానికి తెరదీశారు. పాలకొల్లులో ప్రస్తుత ఎమ్మెల్సీ, అప్పటి జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్‌తో సహా 24 మందిపై, అలాగే దెందులూరు కేసులో జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కామిరెడ్డి నానితో సహా మరో ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

చింతమనేని ప్లానింగ్.. పోలీస్ యాక్షన్

దెందులూరులో అధికార పార్టీ వేధింపుల పర్వం తారాస్థాయిలో కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ కీలక శ్రేణులను టార్గెట్ చేసి మరీ రెడ్‌బుక్ వేధింపులకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యే చింతమనేని డైరెక్షన్‌లో పోలీసులు యాక్షన్ చేస్తున్నారని ప్రచారం బలంగా ఉంది. 2024 ఫిబ్రవరి 4న దెందులూరులో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభ జరిగింది. సభకు లక్షలాది మంది తరలివచ్చారు. ఈ క్రమంలో సభా ప్రాంగణంలో గుంతలు పూడ్చటానికి, లెవెలింగ్ పనులకు పెదవేగి మండలం నుంచి గ్రావెల్ వాహనాలు వస్తున్న క్రమంలో స్థానిక టీడీపీ శ్రేణులతో చిన్నపాటి ఘర్షణ తలెత్తింది. ఈ సంఘటన 2024 జనవరి 30న జరిగింది. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు. కట్ చేస్తే.. అదే సంవత్సరం మే 31న పోలీసులే సుమోటో కేసుగా ఎఫ్ఐఆర్ నం. 211/2024 నమోదు చేశారు. ఈ కేసులో సరిగ్గా ఏడాది మూడు నెలలు తర్వాత వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సోదరులు చల్లగొళ్ల తేజ, చల్లగొళ్ల ప్రదీప్‌ను శుక్రవారం ఉదయం అరెస్టు చేసి పెదవేగిలో కాకుండా ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి.

మంత్రి నిమ్మల అత్యుత్సాహం

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అత్యుత్సాహంతో పాలకొల్లులో పోలీసులు కేసు నమోదు చేశారు. మంత్రి డైరెక్షన్‌లో ఏళ్ల క్రితం నాటి సంఘటనలు తవ్వి తీసి ఎఫ్ఐఆర్ కట్టడం, మళ్లీ దానిని సీఐడీకి బదిలీ చేసేలా చర్యలు తీసుకోవడం విమర్శలకు తావిస్తోంది. పాలకొల్లులో 2022 ఆగస్టు 5న టిడ్కో ఇళ్ల ప్రారంభం సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే నిమ్మలకు ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ యడ్ల తాతాజీ, ముఖ్య నేత గుణ్ణం నాగబాబుల మధ్య తీవ్ర మాటల యుద్ధం జరిగింది. కట్‌చేస్తే.. 2024 డిసెంబర్ 13న పాలకొల్లుకి చెందిన ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి పేరుతో పోలీసులకు ఫిర్యాదు అందింది. 2022లో తాను ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, ఈసారైనా చర్యలు తీసుకోవాలనేది ఫిర్యాదు సారాంశం. వెంటనే మంత్రి నిమ్మల డైరెక్షన్‌లో ముఖ్య నేతలతో కలిపి 24 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో సహా ఇతర సెక్షన్లతో కేసు నమోదు చేయడం, కొందరు ముందస్తు బెయిల్ తెచ్చుకోవడం, మరికొందరు స్టేషన్ బెయిల్ తీసుకోవడం జరిగింది. ఈ క్రమంలో ఈ ఏడాది మే 7న పోలీసులు చార్జిషీటు దాఖలు చేయడంతో కోర్టులో కేసు ప్రారంభమై ఈనెల 31వ తేదీకి 24 మందికి సమన్లు పంపాలని కోర్టు ఆదేశించింది. కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయాలని డీఎస్పీ ద్వారా మెమో పిటిషన్ దాఖలు చేయించి దానిని సీఐడీకి బదలాయించారు. చిన్నపాటి వాదనకి సంబంధించిన సంఘటనపై అట్రాసిటీ కేసు నమోదు చేయడమే కాకుండా మళ్లీ సీఐడీ పేరుతో సరికొత్త వేధింపులకు తెరతీయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

దెందులూరులో అక్రమ అరెస్టులు



రామశింగవరంలో కామిరెడ్డి నానిని అరెస్ట్ చేసి ఏలూరు తరలిస్తున్న పోలీసులు

పెదవేగి: కుటుంబ సభ్యులు, బంధువులు బెంబేలెత్తేలా ఏం జరుగుతోంది.. ఎందుకు వచ్చారు.. అని అడుగుతుండగానే బూటు కాళ్లతో ఇంట్లోకి వచ్చి పోలీసులు చేసిన హడావుడి విమర్శలకు తావిచ్చింది. కూటమి ప్రభుత్వ కక్షపూరిత రాజకీయాలకు శుక్రవారం పెదవేగి మండలంలో జరిగిన అరెస్టులే నిదర్శనంగా మారాయి. పోలీసులు బూట్లతో ఇంట్లోకి చొరబడి మహిళలు వారిస్తున్నా వినకుండా.. ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని 'నేను మీకు పూర్తిగా సహకరిస్తాను. ఎందుకు అరెస్టు చేస్తున్నారు? ఏ కేసులో అరెస్టు చేస్తున్నారు..' అంటూ అడగ్గా చెప్పడానికి పోలీసులు నిరాకరించారు.

వివిధ సెక్షన్లపై కేసులు

రామశింగవరంలో కామిరెడ్డి నానిని మేనత్త ఇంట్లో ఉండగా నూజివీడు టౌన్ సీఐ, దెందులూరు ఎస్సైలు ఏ2గా అరెస్టు చేయగా, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చిన్నాన్న కుమారుడు చల్లగొళ్ల తారకనాథ్ చౌదరి (తేజ)ని ఏ4గా పెదవేగి సీఐ అరెస్టు చేశారు. ఏ5గా చల్లగొళ్ల ప్రదీప్‌ను ఏలూరులోని ఆయన నివాసంలో ముసునూర, చాట్రాయి ఎస్సైలు అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. 211/24 ఎఫ్ఐఆర్‌లో పెదవేగి స్టేషన్‌లో 323, 324, 307, 386, 120(బీ), 148 రెడ్‌విత్, 149 ఐపీసీ సెక్షన్ల పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ నమోదు చేశారు. ఏడాది కిందట జరిగిన గొడవలో తాతా సత్యనారాయణ లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు. అరెస్ట్ అనంతరం వీరు ముగ్గురిని ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రూరల్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

దెందులూరు: వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్ట్ చేసి ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. అరెస్ట్ చేసిన ముగ్గురిని అక్కడి నుంచి వేలిముద్రలు తీసుకోవడానికి క్రైమ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. స్టేషన్ వద్ద నాని మీడియాతో మాట్లాడుతుండగా పెదవేగి ఎస్సై వారించారు. 'నేను అరెస్టుకు, మీతో రావడానికి అన్ని విషయాల్లో సహకరిస్తున్నాను, మీరు చెప్పినట్టు వింటున్నాను, నన్ను ఎందుకు తోసేస్తున్నారు' అని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఏలూరు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జులు మామిళ్లపల్లి జయప్రకాష్, కంభం విజయరాజు స్టేషన్ వద్దకు వచ్చి నానితో మాట్లాడారు. నాని, మాజీ ఎమ్మెల్యే సోదరులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విషయాన్ని పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి తెలియజేస్తామని, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ తోడ్పాటు అందిస్తుందని డీఎన్నార్ అన్నారు.

కామిరెడ్డి అరెస్ట్ అక్రమం



తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శుక్రవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం క్రియాశీలకంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. ఇది దుర్మార్గమైన చర్య, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని, అక్రమ అరెస్టులు తారాస్థాయికి చేరాయన్నారు. చంద్రబాబు నియంతగా ప్రవర్తిస్తున్నారని, అక్రమ కేసులకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడరన్నారు. ఎవరెన్ని కేసులు పెట్టిన నిలబడగలిగే సత్తా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌కు ఉందన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూటమి ప్రభుత్వంపై పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

కక్షపూరిత రాజకీయాలు మానాలి

వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు




కామిరెడ్డి నానితో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఇన్‌చార్జులు

దెందులూరు: కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని, మీ ప్రభుత్వంలో మీరు ఏమి నేర్పుతారో అవే మీకు గుణపాఠం నేర్పుతాయని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్టయిన కామిరెడ్డి నాని, వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శించిన అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జులు మామిళ్లపల్లి జయప్రకాష్ (ఏలూరు), కంభం విజయరాజు (చింతలపూడి)తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2024లో జరిగిన గొడవలో వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లగొళ్ల తేజ, చల్లగొళ్ల ప్రదీప్‌లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. వైఎస్సార్‌సీపీకి ఏడాదిలోపు పెరిగిన ప్రజాదరణను చూసి కూటమి ప్రభుత్వం తట్టుకోలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదీసిందన్నారు. జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉత్సాహంగా పనిచేయడంతో కూటమి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు.

దాడులు.. దౌర్జన్యాలు : వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేసేలా దాడులు, దౌర్జన్యాలకు తెగబడటంతో పాటు ఎలాంటి సంబంధం లేని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిపై కూడా కేసు పెట్టడమేంటని డీఎన్నార్ ప్రశ్నించారు. కూటమి ఆగడాలను న్యాయపరంగా ధీటుగా ఎదుర్కొంటామన్నారు. చింతలపూడి ఇన్‌చార్జి విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధీటుగా ఎండగడుతున్నారని మాజీ సీఎం జగన్, ప్రస్తుత సీఎం చంద్రబాబు పాలనలో తేడాను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. కూటమి నాయకులు రెడ్‌బుక్ రాజ్యాంగంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఏలూరు ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులే టార్గెట్‌గా అణిచివేత ధోరణితో పాత కేసుల్లో ఇప్పుడు అక్రమ అరెస్టులు చేయడం తగదన్నారు. అనంతరం పెదవేగి సీఐ రాజశేఖర్‌ను నాయకులు కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టినా, గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించినా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వడ్డీల కార్పొరేషన్ మాజీ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ మండల కొండలరావు, పార్టీ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏలూరు లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తిపాటి తంబి, ఏలూరు, దెందులూరు, చింతలపూడి, కైకలూరు నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ సుబ్బారెడ్డికి వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. మంగళగిరిలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. వివరాలను సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు జరిగినా వారిని రిలీవ్ చేయనందున చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, చాలాచోట్ల ఉపాధ్యాయుల విద్యార్థుల నిష్పత్తి సరిగా లేదని పేర్కొన్నారు. ఇందుకు ఉదాహరణగా ప్రకాశం, అనంతపురం జిల్లాలో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని వివరించారు. అంతర్ జిల్లాల బదిలీలను చేపట్టాలని, దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న ఎంఈఓలను బదిలీ చేయాలని, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, ఎస్‌జీటీ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు రావటం లేదని పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

పీ4 అమలుపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు శుక్రవారం పీ4 అమలుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సీహెచ్ నాగరాణి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, సీపీఓ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉద్యమ్ వర్క్‌షాప్‌లు

భీమవరం కలెక్టరేట్ నుంచి జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నాగరాణి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఉద్యమ్ నమోదు కేంద్రం ప్రవేశపెట్టిన ఉచిత ఆన్‌లైన్ విధానమన్నారు. వర్క్‌షాప్ ద్వారా ఉద్యమ్ నమోదుపై అవగాహన కల్పించడం, ఎంఎస్ఎంఈల ప్రయోజనాలను వివరించాలన్నారు. పరిశ్రమల శాఖ అధికారి మంగపతిరావు పాల్గొన్నారు.

అల్పపీడనం.. భయం భయం

- రెండు రోజులపాటు భారీ వర్షాలు
- సముద్రంలో వేట నిషేధం
- రైతుల్లో గుబులు



నరసాపురంలో వశిష్ట గోదావరి గట్టుకు చేరుకుంటున్న చెక్క నావలు

నరసాపురం: జిల్లాలో రెండు నుంచి మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలు ప్రజలను భయపెడుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే జిల్లాలో మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం జిల్లాలో సగటున 9.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. పాలకొల్లు మండలంలో అత్యధికంగా 24.4 మి.మీ. వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో సార్వా సాగు చేపట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాట్లు.. నెమ్మది : జిల్లాలో సార్వా వరి సాగు నాట్లు ప్రక్రియ పూర్తిస్థాయిలో మొదలు కాలేదు. పాక్షికంగానే నాట్లు జరుగుతున్నాయి. కాలువలకు సకాలంలో నీరు విడుదల కాకపోవడం, జూన్‌లో వర్షాలు జాడలేకపోవడంతో సాగు జాప్యమవుతోంది. ఈ క్రమంలో భారీ వర్షాలతో నారుమడులు, నాట్లు దెబ్బతింటాయని రైతులు అంటున్నారు.

వేట నిషేధాజ్ఞలు : సముద్రంలో రెండురోజుల పాటు వేట నిషేధాజ్ఞలు జారీ చేశారు. వేట బోట్లు తీరానికి చేరుకుంటున్నాయి. వేట విరామం తర్వాత గతనెల 15న సముంద్రంలో వేట మొదలైంది. సముద్రంలో మత్స్య సంపద అధికంగా లభించే సీజన్ కాగా.. అల్పపీడనంతో మత్స్యకారుల నిరాశ చెందుతున్నారు. అలాగే గోదావరిలో కూడా వరద నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో చెక్క నావలపై సాగే సంప్రదాయ వేటకు కూడా ఆటంకాలు కలుగుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో నరసాపురం సముద్ర తీర ప్రాంతంలో అలజడి వాతావరణం నెలకొంది. సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. పేరుపాలెం బీచ్‌లో యాత్రికులను అనుమతించడం లేదు.

వరద ముంపు ముప్పు

భారీ వర్షాలతో వరద ముంపు ముప్పు పొంచి ఉంది. వరద ముంపు నివారణకు ఏటిగట్ల పటిష్టత వంటి పనులను ఏడాదిగా ప్రభుత్వం చేపట్టలేదు. గతేడాది ఆచంట, యలమంచిలి, పెనుగొండ, నరసాపురం మండలాల్లో గోదావరి వరద పెను నష్టాన్ని మిగిల్చింది. నరసాపురంలో పొన్నపల్లి వద్ద గోదావరి ఏటిగట్టు గండి పడే ప్రమాదాన్ని చవిచూసింది. వరద గండం గడిచినా తర్వాత కాలంలో ఏటిగట్టు పటిష్టతకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఈ వేసవిలోనూ ఎలాంటి పనులు చేయలేదు.

అధ్వానంగా రోడ్లు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. భారీ వర్షాలతో మరింత ప్రమాదకరంగా మారనున్నాయి. వేసవిలో ఎలాంటి మరమ్మతుల ఊసెత్తని ప్రభుత్వం చించినాడ వంతెన వద్ద ప్రస్తుతం వర్షాల సమయంలో పనులు చేపట్టింది. దీంతో భారీ వాహనాల రాకపోకలకు దారి మళ్లించారు.

మన్యంలో జోరువాన



కొమ్ముగూడెం సెంటర్‌లో వాన

బుట్టాయగూడెం: మన్య ప్రాంతంలో నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. శుక్రవారం ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాలు, అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. కొండవాగులు పొంగిపొర్లాయి. దొరమామిడి వారాంతపు సంతలో వర్షానికి వ్యాపారాలు సరిగా సాగలేదు. వర్షాలతో రేపల్లె, రేగులపాడు, డోలుగండి, చింతకొండ, గొట్టాలరేవు తదితర గ్రామాల నుంచి గిరిజనులు బయట ప్రాంతాలకు రాలేని పరిస్థితి. శుక్రవారం ఉదయం 8 గంటల సమయానికి టి.నరసాపురం మండలంలో 21 మి.మీ., బుట్టాయగూడెం మండలంలో 9.8 మి.మీ., జీలుగుమిల్లిలో 19.4 మి.మీ., కొయ్యలగూడెంలో 18.2 మి.మీ., కుక్కునూరులో 6.4 మి.మీ., పోలవరం 8.4 మి.మీ, వేలేరుపాడులో 12 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. రాత్రి 8 గంటల వరకూ వర్షం కురుస్తూనే ఉంది.

న్యూస్‌రీల్

సైలెన్సర్ల ధ్వంసం



రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న సైలెన్సర్లను జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో శుక్రవారం ధ్వంసం చేశారు. రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను తొక్కించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శబ్ద కాలుష్యం పెను ముప్పుగా మారిందని, ఇందుకు కారణమవుతున్న సైలెన్సర్లను వాడుతున్న వాహనదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు కంపెనీ సూచించిన ఒరిజినల్ సైలెన్సర్లు మాత్రమే ఉపయోగించాలన్నారు. అలాగే నంబర్ ప్లేట్‌పై అన్ అథరైజ్డ్ స్టిక్కర్లు, నంబర్లు కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్ ధరించడం ప్రాథమిక బాధ్యతగా భావించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని అన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, కోటేశ్వరరావు, హబీబ్ బాషా, డీసీఆర్‌బీ ఎస్సై ఐ.రాజారెడ్డి పాల్గొన్నారు.

ముళ్లపూడికి శతాబ్ది కాల గౌరవ పురస్కారం



న్యూఢిల్లీలో పురస్కారాన్ని అందుకుంటున్న ముళ్లపూడి నరేంద్రనాథ్

తణుకు అర్బన్: తణుకు ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్ సుగర్ టెక్నాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి శతాబ్ది కాల గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు. భారతీయ చక్కెర అనుబంధ పరిశ్రమల అభివృద్ధి, పురోగతికి ఆయన జీవితకాల అంకిత భావానికి, అత్యుత్తమ సహకారానికి, నిబద్ధతకు గుర్తింపుగా న్యూఢిల్లీలో ఈనెల 24న పురస్కారం అందుకున్నారు. 83వ సుగర్ టెక్నాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెంటెనియల్ కన్వెన్షన్‌లో ఈ పురస్కారాన్ని అందుకున్నట్టు నరేంద్రనాథ్ చెప్పారు.

స్మార్ట్‌మీటర్లపై నిరసన గళం



పోలవరంలో నినదిస్తున్న నాయకులు

పోలవరం రూరల్: విద్యుత్ స్మార్ట్‌మీటర్లు, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. పోలవరం మండల ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యాలయంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పారంలో శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కూటమి నేతలు ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను తొలగిస్తామని హామీ ఇచ్చారని, అయితే నేడు స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. గిరిజన సంఘ, ప్రగతిశీల మహిళా సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకుందాం



ఏలూరులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ జె.సూరిబాబు తెలిపారు. చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో ఈనెల 30 వరకు రైల్వేస్టేషన్లలో ప్రత్యేక తనిఖీలు, రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాలల రక్షణ కోసం 1098, 1800-1027-222లో సంప్రదించాలని కోరారు. పశ్చిమ బెంగాల్, ఒడిసా, చెన్నై, బెంగళూరు, సికింద్రాబాద్ ప్రయాణికులకు మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై అవగాహన కల్పించారు. క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్, జీఆర్పీ ఫోర్స్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మావుళ్లమ్మకు శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం


మావుళ్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక శ్రీ మావుళ్ళమ్మ వారి దేవస్థానంలో శ్రావణమాసం ఉత్సవాలు శుక్రవారంతో నుంచి ప్రారంభమాయ్యాయి. దేవస్థానం ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచే అమ్మవారికి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనానికి తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మున్సిపల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం


ప్రమాదంలో దగ్ధమైన కమిషనర్ చాంబర్

జంగారెడ్డిగూడెం : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కమిషనర్ చాంబర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా కంప్యూటర్ లాప్‌టాప్, ఫర్నీచర్, ఏసీ, విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. ఘటనాస్థలాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తినలక్ష్మి పరిశీలించారు. అగ్ని ప్రమాద విషయాన్ని ఉన్నతాధికారులతో పాటు, విద్యుత్ శాఖ, పోలీసు శాఖకు సమాచారం ఇచ్చామన్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియజేయాలని కమిషనర్ కేవీ రమణను చైర్‌పర్సన్ ఆదేశించారు. వైస్ చైర్మన్ ముప్పిడి ఆంజనేయులు, కౌన్సిలర్‌లు చిటికెల అచ్యుతరామయ్య, పీఎస్ చంద్రరావు, లోకారపు వెంకటేశ్వరరావు అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు.

7 నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఆగస్టు 7 నుంచి పదో తేదీ వరకు స్వామివారి దివ్య పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 7న అంకురార్పణతో ఈ ఉత్సవాలకు శ్రీకారం చుడతారని తెలిపారు. అలాగే 8న పవిత్రాదివాసం, 9న పవిత్రావరోహణ, ఉత్సవాల్లో ఆఖరి రోజైన 10న ఆలయ యాగశాలలో మహా పూర్ణాహుతి వేడుకలు కన్నులపండువగా జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు జరిగే నాలుగు రోజులు ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఈఓ తెలిపారు.

ధర్మవరం, తిరుపతి రైళ్ల రద్దు

పాలకొల్లు సెంట్రల్: రైల్వే మరమ్మతులు, ట్రాక్ పనుల్లో భాగంగా నరసాపురం నుంచి ధర్మవరం, తిరుపతి రైళ్ల రద్దు చేస్తున్నట్లు రైల్వే డీఆర్‌యుసిసి సభ్యులు జక్కంపూడి కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకనట విడుదల చేవారు. నరసాపురం నుంచి ధర్మవరం వెళ్లే 17247 రైలు ఆగస్టు 11 నుంచి 19 వరకూ, ధర్మవరం నుంచి నరసాపురం వచ్చే 17248 రైలు ఆగస్టు 12 నుంచి 20 వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే తిరుపతి నుండి నరసాపురం వచ్చే 07131 రైలు ఆగస్టు 17న, నరసాపురం నుంచి తిరుపతి వెళ్లే 07132 రైలు ఆగస్టు 18న రద్దు చేస్తున్నట్లు వివరించారు.

మన్యంలో జలపాతాల సోయగం


ఉప్పరిల్ల సమీపంలో ఆకట్టుకుంటున్న జలపాతం


ముంజులూరు సమీపంలో ఉన్న ఏనుగుతోగు జలపాతం

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏజెన్సీ ప్రాంతంలోని జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. బుట్టాయగూడెం మండలం అటవీప్రాంతంలో ఉన్న ఉప్పరిల్ల జలపాతం, ముంజులూరు సమీపంలో ఉన్న ఏనుగుతోగు జలపాతం, పాపికొండల అభయారణ్యంలో ఉన్న జలతరు వాగు జలపాతం వర్షాలకు విస్తృతంగా పొంగిపొర్లుతున్నాయి. సమీపంలో ఉన్న అనేక మంది పొంగే జలపాతాలను చూసేందుకు వస్తున్నారు. అయితే ప్రస్తుతం విస్తారంగా వర్షాలు ఉన్నందున జలపాతాలను చూసేందుకు వెళ్లే పర్యాటకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

– బుట్టాయగూడెం


పాపికొండల అభయారణ్యంలో ఉన్న జలతారు వాగు

మూడు గంటల్లోనే మిస్సింగ్ కేసు ఛేదన

తాడేపల్లిగూడెం : అదృశ్యమైన బాలుడిని పెంటపాడు పోలీసులు మూడు గంటల్లో సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. తాడేపల్లిగూడెం రూరల్ ఇన్‌చార్జి సీఐ బోణం ఆదిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పెంటపాడు మండలం రాచర్ల గ్రామానికి చెందిన ఈదరాడ కామేశ్వరరావు అనే వ్యక్తి తన చెల్లెలు కనిపించడం లేదని ఫిర్యాదు చేయడానికి గురువారం అర్ధరాత్రి 2.30 సమయంలో ఆయన తల్లి, ఇద్దరు మేనల్లులతో కలిసి పెంటపాడు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. పోలీసు స్టేషన్ పక్కనే ఉన్న రోడ్డులో కారు పార్కు చేసి, అందులో నాలుగు సంవత్సరాల మేనల్లుడిని నిద్రపుచ్చి కారును లాక్ చేసి, మిగిలిన వారు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఫిర్యాదు అనంతరం తిరిగి కారు వద్దకు రాగా, కారులో బాలుడు కనిపించలేదు. వెంటనే వారు తిరిగి స్టేషన్‌కు వెళ్లి మళ్లీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెంటపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ ఇన్‌చార్జి సీఐ బోణం ఆదిప్రసాద్ ఆధ్వర్యంలో పెంటపాడు ఎస్సై కేసీహెచ్ స్వామి తన సిబ్బందితో ప్రత్యేక టీమ్‌గా ఏర్పడ్డారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా గాలింపులు జరిపారు. మూడు గంటల వ్యవధిలో బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.


బాలుడితో తాడేపల్లిగూడెం పోలీసులు

సీతారామస్వామి ఆలయ భూమి స్వాధీనం

జంగారెడ్డిగూడెం: ఎన్నో ఏళ్లగా కోర్టు వివాదంలో ఉండి ఆక్రమణలో ఉన్న దేవదాయ శాఖ భూమిని శుక్రవారం ఆ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం స్థానిక బుట్టాయగూడెం రోడ్డులోని సీతారామస్వామి ఆలయానికి పట్టణంలోని సుబ్బంపేటలో 121/3 సర్వే నెంబర్‌లో 33.65 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో పామాయిల్ తోట ఉంది. అయితే ఈ తోటను చాలా ఏళ్ల క్రితం కొందరు వ్యక్తులు లీజుకు తీసుకుని సేద్యం చేసేవారు. ఆ తరువాత 2002లో ఈ భూమికి లీజుదారులకు రెవెన్యూ శాఖ పట్టాదారుపాస్ పుస్తకం జారీ చేసింది. దీంతో వివాదం మొదలైంది. అప్పటి నుంచి దేవాదాయ శాఖ కోర్టులో పోరాటం చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఇటీవల కోర్టు దేవదాయ శాఖకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్, దేవాదాయ శాఖ అధికారులు సుబ్బంపేటలోని భూమిని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ పామాయిల్ తోట ముదురు తోట అని, ఇక కాపు కాయదని ఉద్యానశాఖ లేఖ ఇవ్వడంతో పామాయిల్ మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 5 జేసీబీలను పెట్టి పామాయిల్ మొక్కలను తొలగించారు. ఈ భూమిని చదును చేసి లీజుకు వేలం నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు.


జంగారెడ్డిగూడెంలో భూమిని స్వాధీనం చేసుకున్న దేవదాయ శాఖ అధికారులు

ట్రైతలాన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తణుకు అర్బన్ : జిల్లా ట్రైతలాన్ (రన్నింగ్, స్విమ్మింగ్, షూటింగ్) పోటీల్లో మండలంలోని మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చూపించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ఫణిశ్రీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ఈనెల 24వ తేదీన తేతలిలోని స్టెప్పింగ్ స్టోన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన అండర్ 17 విభాగంలో ఎస్.గణేష్, అండర్ 15 విభాగంలో కె.కిరణ్, ఎస్.రోహిత్, జి.రమేష్, అండర్ 13 విభాగంలో జి.ఆనంద్ శ్రీనివాస్ ప్రతిభ చూపారని వివరించారు. వీరు ఈ నెల 26, 27 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ట్రైతలాన్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణను పలువురు అభినందించారు.


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం ఫణిశ్రీ, పీడీ సూర్యనారాయణ

పొలసానిపల్లి గురుకులం పరిశీలన

భీమడోలు: మండంలోని పొలసానిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల భవనాలను తక్షణమే నిర్మించాలని, తాత్కాలిక షెడ్లను నిర్మించి బాలికలకు తరగతులను నిర్వహించాలని సీపీఎం ప్రతినిధుల బృందం డిమాండ్ చేసింది. పోలసానిపల్లిలో రెండు శ్లాబ్‌లు కూలడం, ఓ విద్యార్థినీ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో శుక్రవారం సీపీఎం ప్రతినిధుల బృందం సందర్శించింది. గురుకుల కళాశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ దళితుల విద్యపై ప్రభుత్వం అసలు శ్రద్ధ తీసుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల నిర్వహకులు కట్టా భాస్కరరావు, మండల నాయకులు పోలుకొండ నాగరాజు, మానుకొండ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


కూలిన శ్లాబ్‌లను పరిశీలిస్తున్న సీపీఎం ప్రతినిధుల బృందం

ఆకట్టుకున్న నిమ్మకాయల అలంకరణ


శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా యలమంచిలి గ్రామ దేవత మూలస్థానేశ్వరి దేవి అమ్మవారిని తొమ్మిది వేల నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు కిరణ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

- యలమంచిలి

చెట్ల నరికివేతపై వాల్టా యాక్ట్ అమలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీలో ఏళ్ల నాటి చెట్లను నరికివేయడంపై 'మాయమవుతున్న వన సంపద'అనే శీర్షికతో శుక్రవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో అటవీ శాఖ అధికారులు స్పందించారు. భీమవరం రేంజ్ అధికారి మురాల కరుణాకర్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎస్.సురేష్‌కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బృందం కొండ్రుప్రోలులో పర్యటించింది. ఈ సందర్భంగా రేంజ్ అధికారి కరుణాకర్ మాట్లాడుతూ మామిడి, వేప, రావిచెట్టు, తాటి చెట్టు, గుల్‌మోహర్ చెట్ల కలపను గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు సంబంధిత శాఖ అధికారుల అనుమతితో బహిరంగ వేలం వేయాలని ఆదేశించామని తెలిపారు. అయినప్పటికీ పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని వెల్లడించారు. ఏపీ వాల్టా చట్టం ప్రకారం విచారణ చేపడతామని తెలిపారు. తదుపరి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

సాక్షి స్పందన


కాలనీలో నరికివేసిన చెట్ల కొలతలను సేకరిస్తున్న అటవీ శాఖ అధికారులు

నగదు చోరీ కేసులో నిందితుల అరెస్ట్

భీమవరం (ప్రకాశంచౌక్): స్కూటర్ డిక్కిలో రూ.3 లక్షల నగదు చోరి చేసిన కేసులో నిందితుల అరెస్ట్ చేశామని డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. జూలై 4న అమలాపురం నుంచి వచ్చిన బాధితుడు ఎం.రమేష్ బాబు నగదును వేరొకరికి ఇద్దామనుకున్నారు. కళాభవన్ వీధిలో ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఇంట్లోకి వెళ్లి వచ్చేలోపు డిక్కీ తెరిచి నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా విజయనగరం జిల్లాకు చెందిన మేకల బాలరాజు, ఒడిశాకు చెందిన దాసు రబి (రవి) నగదు చోరీ చేశారని గుర్తించారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3 లక్షల సొమ్మును రికవరీ చేశారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, వన్‌టౌన్ సీఐ నాగరాజు

యువతిని మోసం చేసిన యువకుడికి ఏడాది జైలు

ఏలూరు (టూటౌన్): ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానా విధిస్తూ ఏలూరు ఐదో అదనపు జిల్లా సెషన్స్, మహిళాకోర్టు న్యాయమూర్తి అర్‌వీవీఎస్ మురళీ కృష్ణ శుక్రవారం తీర్పును వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెనికి చెందిన సారంపాటి రాజేష్ ఫిర్యాది అయిన బాధితురాలిని వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అనంతరం పెళ్లికి అంగీకరించపోవడంతో బాధితురాలు జంగారెడ్డిగూడెం పోలీసులను ఆశ్రయించింది. అప్పటి ఎస్సై ఎం.సాగర్ బాబు కేసు నమోదు చేయగా, సీఐలు ఎంవీవీఎస్ మల్లేశ్వరరావు, పీబీ సురేష్ బాబు కేసును విచారించి చార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. ఈ మేరకు న్యాయమూర్తి ముద్దాయికి ఐపీసీ సెక్షన్ 417 ప్రకారం ఏడాది సాధారణ కారాగార శిక్ష విధించడంతో పాటు రూ.2లక్షలు జరిమానా విధించి ఆ మొత్తాన్ని బాధితురాలికి నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశించారు.

చోరీ కేసులో వ్యక్తికి ఏడు నెలల జైలు

భీమవరం అర్బన్: స్కూటర్ డిక్కీలోని రూ.15 వేలు చోరీ చేసిన గేదెల వెంకన్న అనే యువకుడికి ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి సురేష్ బాబు శుక్రవారం తీర్పునిచ్చారు. రూరల్ ఎస్సై ఐ.వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది జనవరి 1న కొవ్వాడ గ్రామానికి చెందిన ఉప్పల రాము తన భార్యతో స్కూటర్‌పై నరసింహపురం రోడ్డులోని దేవాలయానికి వచ్చాడు. స్కూటర్‌ను బయటన పార్క్ చేసిన దర్శనం చేసుకుని వచ్చేసరికి డిక్కీలోని రూ. 15 వేలు ఎవరో దొంగిలించారని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు అప్పట్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

9న ఏపీ నిట్ స్నాతకోత్సవం

తాడేపల్లిగూడెం: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) ఏడో స్నాతకోత్సవం ఆగస్టు 9న నిర్వహించనున్నారు. ఈ మేరకు నిట్ అధికారవర్గాలు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టీసీఎస్ లిమిటెడ్, టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రెసిడెంట్ వి.రాజన్న ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ మోటార్ దొంగలించిన వ్యక్తికి ఆరు నెలల జైలు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో అనాకోడేరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి విజయ రామరాజు తన చెరువు వద్ద విద్యుత్ మోటార్ దొంగిలించినట్లు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యుత్ మోటార్ దొంగిలించిన నేపాల సూర్యనారాయణను శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువు కావడంతో సీనియర్ సివిల్ జడ్జి సురేష్ సూర్యనారాయణకు నిందితుడికి 6 నెలలు జైలు శిక్ష విధించినట్లు రూరల్ ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు బకాయిపడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నవాబుపాలెం సచివాలయం వద్ద వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రామికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ 10 నుంచి 12 వారాలు పనిచేస్తే కేవలం రెండు వారాల సొమ్ములు మాత్రమే జమ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కండెల్లి రమేష్ బాబు, కండెల్లి విజయ, నూతంగి సూర్యారావు, బైపో ప్రసాద్, దిద్దే అబ్బులు, కొల్లి మేరీ, ఉండ్రాజవరపు భాను పాల్గొన్నారు.


నవాబుపాలెం సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జరిమానా

ముసునూరు: ఎక్సైజ్ నేరంలో బైండోవర్ ఉల్లంఘించి, నాటుసారా అమ్ముతున్న మహిళకు భారీ జరిమానా విధించి, బెల్లం వ్యాపారిని బైండోవర్ చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య చెప్పారు. ఎలాంటి నేరానికి పాల్పడనని బైండోవర్ అయిన చెక్కపల్లికి చెందిన నక్కా దుర్గ తిరిగి అదే నేరానికి పాల్పడడంతో శుక్రవారం ఆమెను తహసీల్దార్ ప్రశాంతి ఎదుట ప్రవేశపెట్టగా రూ.10 వేలు జరిమానా విధించారు. లోపూడికి చెందిన బెల్లం వ్యాపారి జల్లు హరిరామకృష్ణను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్‌టీసీ బస్సు

పెదవేగి: మండలంలోని దుగ్గిరాల సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకుపోయింది. ఆర్టీసీ డ్రైవర్‌కు వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

రేపు ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి పరీక్ష

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రాంతంలోని కొంతమూరులో ఉన్న ఎస్తేర్ ఏగ్నిస్ రెసిడెన్షియల్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, ఎస్తేర్ ఏగ్నిస్ రెసిడెన్షియల్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఆదివారం కంప్యూటర్ బేస్డ్‌టెస్ట్ (సీబీటీ) నిర్వహిస్తారని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకనట విడుదల చేశారు. మొదటి సెషన్ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ, రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ పరీక్షలు కాకినాడలోని అచ్యుతాపురం అయాన్ డిజిటల్ జోన్-ఐడీజడ్, రాజమహేంద్రవరం లూథర్ గిరిలోని అయాన్ డిజిటల్ జోన్-ఐడీజడ్‌లో జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ పరీక్షల సంబంధించిన సమాచారం కోసం 98485 74622, 83091 77952 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పశ్చిమగోదావరి పరీక్షల నిర్వహన ఇలా

పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, శ్రీ కోట్ల వెంకట రామయ్య బాలికోన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ టీచింగ్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు భీమవరం దంతులూరి నారాయణ రాజుఅటానమస్ కాలేజీ, భీమవరం డీఎన్నార్ కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కాలేజీ, శశి ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్స్ డౌన్లోడ్ కోసం 99892 71919 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సదరు పోస్టులకు ఆన్‌లైన్, ప్రత్యక్షం గానూ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు సీఎస్‌ఈ ఏపీ వెబ్ సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు 90 నిమిషాల ముందు ఒక గుర్తింపు పొందిన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



తణుకు అమ్మనాంబ ఆశ్రమంలో భోజనాలు చేస్తున్న వృద్ధులు

తణుకు అర్బన్: తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులోని అమ్మనాంబ ఆశ్రమంలో శుక్రవారం దేవతా మూర్తులకు ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం దానేశ్వరీ హోరో షోరూం అధినేత సతీష్ కుమార్ బొల్లా ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులతో పాటు భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఆశ్రమంలో మాతాశ్రీ శాంతమ్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర నామాలు, గాయత్రి శ్లోకాలు భక్తులు పఠించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

దుర్గమ్మకు విశేష పూజలు



విశేష అలంకరణలో కనకదుర్గమ్మ

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాజమండ్రికి చెందిన బీరం నరసింహరావు, విజయలక్ష్మి దంపతులు, వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించార. సుమారు 280 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సాతులూరి పవన్ కుమార్, కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయ భాను, గ్రామస్తులు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రత్తిపాడు వై. జంక్షన్ దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద కనకదుర్గమ్మకు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు



తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్ఓ జి.గీతాబాయి

తాడేపల్లిగూడెం: విధి నిర్వహణలో డాక్టర్లు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిని డా.జి.గీతాబాయి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు. రవిమాధవ్ నర్సింగ్ హోం, విజయ ఆస్పత్రిని సందర్శించారు. ఏపీఎంసీఈ చట్ట పరిధిలో ఆసుపత్రుల్లో నిబంధనలు పాటిస్తున్నారో లేదో పరిశీలించారు. రికార్డులను చూశారు. ఎవ్వరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు తీసుకొని, ఆసుపత్రులను సీజ్ చేస్తామన్నారు.

భావితరాల ఆరోగ్యానికి సేంద్రియ సాగు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం నూకరాజు

తాడేపల్లిగూడెం రూరల్: భావితరాలు ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియసాగును ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు కోరారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం నూకరాజు మాట్లాడుతూ ప్రతి రైతు తమకున్న పొలంలో కొంత సేంద్రియ విధానంలో పంటలు పండించాలన్నారు. పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, కషాయాలద్వారా వ్యవసాయం చేయాలన్నారు. తద్వారా సాగులో ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చన్నారు. అనంతరం ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, కోడిగుడ్ల నిమ్మరసం ద్రావణం, అగ్నాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు ఏవోలు నారాయణరావు, చిర్ల రవికుమార్, ఏఈవో డి.విద్యాసాగర్, తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

31న 'గూడెం' మండల పరిషత్ సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 31న మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన తెలిపారు. ఎంపీపీ పానుకు మాటి శేషులత అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

అలంకారప్రాయంగా గ్రంథాలయ భవనం

- ఏప్రిల్‌లో ప్రారంభించినా అందుబాటులోకి రాని వైనం
- తాత్కాలిక భవనం దూరం.. పై అంతస్తు ఎక్కలేక చదువరుల పాట్లు
- రూపాయి బిల్లు ఇవ్వక కాంట్రాక్టరు అగచాట్లు
- ఇదీ కూటమి ప్రభుత్వ నిర్వాకం



తణుకులో నిరుపయోగంగా మారిన ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయం

తణుకు అర్బన్: నూతన భవన నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం అయినప్పటికీ తణుకు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం భవనం అలంకారప్రాయంగా మారిందని చదువరులు ఆరోపిస్తున్నారు. తణుకు బ్యాంక్ కాలనీలో ఏళ్ల తరబడి ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో 2024 జనవరి నెలలో ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయ నూత న భవన నిర్మాణానికి రూ. 1.03కోట్లు గ్రంథాలయ సంస్థ నిధులతో అప్పటి పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ చేతులమీదుగా నిర్మాణానికి శంఖుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే భవన నిర్మాణం పూర్తయి ఈ ఏడాది ఏప్రియల్ నెలలో పారంభోత్సవం అట్టహాసంగా చేశారు. నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సం జరిగి 3 నెలలు దాటినా ఇంతవరకు గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకురాకపోవడంతో చదువరులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణ సమయంలో బ్యాంక్ కాలనీ నుంచి ఈ గ్రంథాలయాన్ని సొసైటీ రోడ్డులోని రాజీవ్‌గాంధీ కాంప్లెక్స్‌లోని పై అంతస్తులోకి మార్చారు.

రూపాయి విదల్చని వైనం..

గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తిచేసినప్పటికీ ఇంతవరకు కాంట్రాక్టరుకు రూపాయి కూడా విదల్చని పరిస్థితి నెలకొంది. టెండరు ప్రక్రియ ప్రకారం రూ. 1.03 కోట్లు గ్రంథాలయ సంస్థ నిధులతో భవనం పూర్తిచేసి అప్పగించినప్పటికీ బిల్లులు చేయకపోవడం కూడా తీవ్ర దుమారం లేపుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బిల్లు చేయకపోవడంతో 90 శాతం పనులు పూర్తయిన సందర్భంలో కాంట్రాక్టరు పనులు నిలిపివేశారు. అయితే బిల్లు మంజూరు చేస్తామని మిగిలిన పనులు కూడా పూర్తిచేయాలనే ఒత్తిడితో పూర్తిస్థాయిలో పనులు చేసినప్పటికీ నేటికీ బిల్లులు చేయపోవడం శోచనీయం.

దూరాభారంతో చదువరుల పాట్లు..

మొదటి నుంచి బ్యాంక్ కాలనీలో సొంత భవనంలోఉన్న గ్రంథాలయానికి స్థానికంగాఉన్న ప్రజానీకం పూర్తిగా అలవాటు పడ్డారు. నిత్యం విద్యార్థులు, యువత, వృద్ధులు సైతం అధికసంఖ్యలో గ్రంథాలయానికి వచ్చి వారికి అవసరమైన విజ్ఞాన పుస్తకాలతో పాటు దినపత్రికలను చదువుతుంటారు. ప్రతి రోజు వందకుపైగా చదువరులు ఈ గ్రంథాలయానికి వెళ్లి తమకు అవసరమైన విజ్ఞానాన్ని చదువుతుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో అలవాటుపడ్డ ప్రాంతానికి దూరంగా కిలోమీటరుకుపైగా ఉన్న సొసైటీ రోడ్డులోకి గ్రంథాలయాన్ని మార్చడంతో పాటు పనులు పూర్తయినా భవనాన్ని అందుబాటులోకి తీసుకురాకపోవడంతో చదువరులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు పై అంతస్తులోకి మెట్ల మార్గంలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతూ వెళ్లడంకూడా మానుకున్నారు. యువత వారికి అవసరమైన కాంపిటేటివ్ పుస్తకాల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో దూరమైనా వెళ్లి పుస్తకాలతో కాలం గడుపుతున్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు



బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శ్రావణ మాసం తొలిరోజు శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అదే విధంగా అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజి పర్యవేక్షించారు.

ఘనంగా రుక్మిణీ కల్యాణం సామూహిక పారాయణం

స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో శ్రావణ మాసం సందర్భంగా హరిసర్వోత్తమ, కోదండరామ, శ్రీకృష్ణ భజన మండలి వారిచే శుక్రవారం సౌందర్యలహరి, రుక్మిణీ కల్యాణం సామూహిక పారాయణం జరిగింది. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



తణుకులో అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ గీతాబాయ్

తణుకు అర్బన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జి.గీతాబాయ్ సూచించారు. తణుకు బ్యాంక్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా మునిసిపల్ సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రక్షిత మంచినీరు తాగడం ద్వారా డయేరియా బారినపడకుండా ఉండవచ్చనే విషయాన్ని ప్రజలకు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు తప్పవు

స్కానింగ్ సెంటర్‌లలో గర్భిణుల విషయంలో లింగ నిర్ధారణకు పాల్పడితే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి.గీతాబాయ్ హెచ్చరించారు. తణుకు పట్టణంలో శుక్రవారం పలు ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా యాజమాన్యాలు తమ కేంద్రాల్లో ధరల పట్టికను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు.

స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి



సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలపై మరింత కరెంటు భారాలు వేసే అదానీ స్మార్ట్ మీటర్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పట్టణ ప్రజలకు సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అదానీ స్మార్ట్ మీటర్లును వ్యతిరేకించాలని కోరుతూ 5వ రోజు శుక్రవారం ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ర్యాలీలు జరిగాయి. కడకట్ల, రామారావుపేటలలో ప్రచార ర్యాలీ జరిగింది. కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ పెంచిన చార్జీలను తగ్గించాలని, ప్రజలపై అదనపు భారాలను రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన విద్యుత్ సంస్కరణలలో భాగంగా టీడీపీ కూటమి ప్రభుత్వం అదానీ స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆలోచన చేస్తుందన్నారు. అదానీ మీటర్లు బిగిస్తామని వస్తే ప్రజలు బుద్ధి చెపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 2 కోట్లు విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటి స్థానంలో అదానీ స్మార్ట్ మీటర్లును ఇళ్లకు బిగించాలని కూటమి ప్రభుత్వం చూడటం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు తప్పక కూటమి ప్రభుత్వాలకు బుద్ధిచెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నం రెడ్డి శివాజీ, దత్తు రాము, ఎస్.సాయి, బి.బాలాజీ, బి.శివ, యడ్ల శ్రీను, కె.ఉదయ్ కుమార్, పతివాడ నాగేంద్రబాబు పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించండి



ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 25వ వార్డు యాగర్లపల్లి ప్రాంతంలోను, అదే విధంగా రామాలయం సమీపంలోని ఖాళీ స్థలాలలో భారీగా పిచ్చి మొక్కలు, కలుపు మొక్కలు, ముళ్ల మొక్కలు వేపుగా పెరుగుతున్నాయని, దీంతో వాటితో స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలు ఇక్కట్లు పడుతున్నామని సత్యనారాయణ, నాగమణి, కె.అప్పారావు తదితర స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మొక్కలు కారణంగా కారణంగా ఉబ్బసం వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని వాపోయారు. అంతేగాక వీటితో పాటు విష సర్పాలు తిరుగుతున్నాయని, కొన్ని సమయాలలో అవి ఇంటిలోకి వస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా డ్రెయినేజీల్లో సైతం మురుగు ముందుకు పారడం లేదని, వ్యర్థాలు ఎక్కడవి అక్కడే ఉంటున్నాయని చెప్పారు. మునిసిపల్ అధికారులు వార్డును సందర్శించాలని, ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని, పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు. డ్రెయిన్‌లలో వ్యర్థాలను తొలగించి, మురుగునీరు ముందుకు సాగే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం

తణుకు అర్బన్: ప్రపంచ ఐవీఎఫ్ డే సందర్భంగా తణుకు సొసైటీ రోడ్డులోని సుధ ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) సెంటర్‌లో శుక్రవారం సంతానం లేని దంపతులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన వారికి సెంటర్ వైద్యురాలు డాక్టర్ కె.ప్రశాంతి ప్రత్యేక వైద్యసేవలు అందజేసి, సంతానం లేని దంపతులకు ఉచితంగా స్క్రీనింగ్, స్కానింగ్, సీమన్ ఎనాలసిస్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు. తమ ఆస్పత్రిలో సంతానలేమి చికిత్సతో పాటు పలు విభాగాల్లో వైద్యసదుపాయాలు అందుబాటులో ఉన్నట్లుగా డాక్టర్ ప్రశాంతి తెలిపారు. వివాహమై ఏడాది లోపు సంతానం కలగని దంపతులు, నెలసరులు సక్రమంగా రానివారు, గర్భస్రావం జరిగి మళ్లీ గర్భధారణ కోసం, 40 సంవత్సరాలు పైబడిన స్త్రీలు సంతానం కోసం, గర్భాశయ సంబంధిత అన్ని రకాల వ్యాధులకు వైద్యసేవలు అందుబాటులో ఉన్నట్లుగా చెప్పారు.

మత్తుకు బానిసలు కావొద్దు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మత్తుకు శ్రామికులు ఆకర్షితులు కావొద్దని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ మల్లిపూడి హిమ మిత్ర విజ్ఞప్తి చేశారు. దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ మినిస్టరీ ఆఫ్ సోషల్ జస్టిస్ సహకారంతో దీక్షా డ్రగ్ డి అడిక్షన్ సెంటర్ వారిచే మత్తు మందులు, మద్యం వల్ల కలిగే నష్టాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం మార్కెట్ యార్డులో జరిగింది. వక్తలు మాట్లాడుతూ పనిచేసే శ్రామికులు శారీరక బాధలు తట్టుకునేందుకు మద్యం సేవిస్తున్నారని, ఈ విధానం సరికాదని, హానికరమన్నారు. సొసైటీ కౌన్సిలర్ పి.వెంకటేష్, ఎస్‌కేపీ ప్రసాద్, పి.నాగలక్ష్మి, టి.నవీన్ పాల్గొన్నారు.

కంటి రుగ్మతలను అశ్రద్ధ చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం



కార్మికులకు అందుతున్న కంటి పరీక్షలను పరిశీలిస్తున్న మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రాజకుమారి

తణుకు అర్బన్: కంటి రుగ్మతలను అశ్రద్ధ చేస్తే కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ వంక రాజకుమారి అన్నారు. శుక్రవారం తేతలిలోని ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులకు ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్, ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పాలకొల్లు లయన్స్ ఆధ్వర్యంలో రాజవల్లి రాధారామన్ కంటి ఆసుపత్రి ద్వారా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ మానవ దేహంలో కంటికి ఎంతో ప్రాధాన్యత ఉందని, కంటిచూపు లేకపోతే జీవితం అంధకారంగా మారుతుందని స్పష్టం చేశారు. ఇదే ఉద్దేశ్యంతో తమ ఇండస్ట్రీస్‌లోని కార్మికులు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ కార్మికులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 365 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 11 మందికి కాట్రాక్ట్ శస్త్రచికిత్సలు, 5 గురికి కంటి పై పొర శస్త్రచికిత్సలు అవసరం ఉన్నట్లు వైద్యులు గుర్తించారని వారందరికీ శస్త్రచికిత్సలు చేయడానికి ఏర్పాట్లు చేయనున్నామని, 72 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అల్లూరి లక్ష్మీపతిరాజు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని కడకట్ల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో హౌసింగ్‌బోర్డు కాలనీలో శుక్రవారం వెక్టార్ హైజీన్ కార్యక్రమాలు, ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పక డ్రై డే పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ చుట్టు ఉన్న ఇంటి పరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఇంటిలోపల నీటి కుండీలు,పనికిరాని టైర్లు, ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ డబ్బాలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. మంచి నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలలో టైగర్ దోమలు అవాసాలు ఉంటాయని, వీటి వల్ల డెంగ్యూజ్వరాలు వస్తాయని చెప్పారు. మురుగు నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలలో అనాఫిలాస్ దోమలు పెరుగుతాయని మలేరియా వస్తుందని చెప్పారు. వర్షకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దోమ తెరలు వాడాలన్నారు. హెల్త్ అసిస్టెంట్లు రామకృష్ణ, కాంతారావు, ఎస్ఎస్ఎంలు రాజేశ్వరీ, జ్యోతి, ఆశాలు స్వాతి, పుష్పవతి, అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం ఎంఈఓ హనుమ తీరు బాధాకరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉపాధ్యాయుడిగా తనను తాను పరిచయం చేసుకోవడానికి కార్యాలయానికి వెళ్లిన, తనపట్ల ఎంఈఓ హనుమ అసహనంగా వ్యవహరించారని, అసభ్యపదజాలం వాడారని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా కార్యదర్శి వేదాల ఉదయ్ కుమార్ ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన విలేఖర్ల సమావేశంలో వేదాల ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారిగా ఉంటూ టీచర్స్ పట్ల అగౌరవంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈవిషయంపై కొందరు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు తనపై చేస్తున్న ఆరోపణలన్నీ అబద్ధాలేనని ఎంఈఓ హనుమ ఖండించారు. ప్రభుత్వ ఆదేశాలకు లోబడి పనిచేస్తున్నాను. డ్యూటీ పరంగా మాట్లాడాను తప్పా, ఎవరిని దూషించలేదని, బాధించినట్లు అయితే అన్యథా భావించవద్దని సంఘ నాయకులను, ఉపాధ్యాయులను కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

నరసాపురం రూరల్: శ్రావణమాసం మొదటిరోజు శుక్రవారం కావడంతో లక్ష్మీదేవి, అమ్మవార్లకు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించార. మహిళలు ఎంతో పవిత్రంగా ఆచరించే శ్రావణమాసం తొలిరోజు లక్ష్మీదేవికి ప్రీతికరమైన శుక్రవారం రోజు కావడంతో అమ్మవారికి కుంకుమ పూజలు, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు, తీపి పదార్థాలు మొదలైన వాటిని సమర్పించుకున్నారు. ఈ పూజలు సౌభాగ్యం, సంపద లతో పాటు కుటుంబ క్షేమాన్ని కోరుకుంటూ నిర్వహించారు. నరసాపురం మండలం యర్రంశెట్టివారిపాలెం శ్రీ గోగులమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యామాంబ, ఎంపీటీసీ ఆకన శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇలా వదిలేస్తే ఎలా..!



రేలంగిలో మూలనపడ్డ చెత్త సేకరణ వాహనాలు



రేలంగిలో పూర్తిగా పాడైన చెత్త సేకరణ బండ్లు

- వాహనాలు ఇలా..చెత్త సేకరణ ఎలా?
- మూలకు చేరిన చెత్త సేకరణ వాహనాలు

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ నిర్వహణ కొరవడింది. దీంతో విలువైన వాహనాలు మూలకు చేరుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించడం కత్తిమీద సాముగా మారింది. అయితే ప్రతి పంచాయతీలో ఉపాధిహామీ నిధులతో నిర్మాణం చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ కొరవడుతుంది. రేలంగి గ్రామం ఇరగవరం మండలం మేజర్ గ్రామ పంచాయతీ. 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 14,559 మంది జనాభా ఉండగా ఇప్పుడు సుమారు 20వేల మంది జనాభా ఉన్నారు. దీంతో వారి అవసరాలు పెరిగాయి. రేలంగి గ్రామ పంచాయతీ పరిధిలో చెత్తను డంపింగ్ యార్డులకు చేరవేయడానికి 22మంది శానిటేషన్, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. ఇద్దరికి ఒక వాహనం చొప్పున 11చెత్త సేకరించే వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతిరోజు పారిశుద్ధ్య రెండు నుంచి నాలుగుసార్లు చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు చేరవే యాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీలో చెత్తను సేకరించేందుకు సరిగ్గా మూడు వాహనాలు కూడా లేవు. దీంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే నిల్వ ఉండిపోతుంది. దాని కారణంగా గ్రామాల్లో దుర్వాసన రావడం, ఈగలు, దోమలు ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలు తరుచు రోగాల బారీన పడుతున్నారు. దీనికి తోడు వర్షాలు ఎక్కువగా కురవడంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోతుంది. వెంటనే చెత్త తరలించే వాహనాలు బాగు చేసి ఎప్పటి చెత్తను అప్పుడు డంపింగ్ యార్డులకు తరలించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేస్తున్నాం



మండలంలో చెత్త సేకరణ యంత్రాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తాం. ఈ లక్ష్యం నెరవేరే విధంగా చూస్తాం. ఈ కేంద్రాలపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయించి, చెత్త సేకరణ వాహనాలకు మరమ్మతులు చేయిస్తున్నాం. రేలంగి గ్రామ పంచాయతీలో శివారు ప్రాంతాల నుంచి చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

– బి లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి

చెత్తను తరలించడం ఇబ్బందిగా ఉంది



రోజు చెత్తను బయటకు తరలించడం చాలా ఇబ్బందిగా ఉంటుంది వాహనలు తక్కువగా ఉండటం వాటిలో కొన్ని పనిచేయక పోవడంతో ఉన్నా వాహనాలతోనే చెత్తను బయటకు తరలించడం జరుగుతుంది. వాహనలు తరుచూ మరమ్మతులకు గురౌతున్నాయి. వాటిని బాగు చేస్తున్నారు. అయినా శాశ్వతపరిష్కారం లభించడం లేదు.

– బంగారు ఏడుకొండలు, రేలంగి పారిశుద్ధ్య కార్మికుడు